అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక
సంపుటి: 01 సంచిక : 208. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ మంగళవారం.06.05.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## గాలివాన బీభత్సం

మందమర్రి, మే 5 :అమృత్ తెలంగాణ: మంచిర్యాల జిల్లాలో ఆదివారం రాత్రి, సోమవారం రాత్రి పలు మండలాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. తీవ్రమైన ఈదురు గాలులతో కూడిన వర్షంతో చెట్లు విరిగి పడి ఇండ్లు, గోడలు, షెడ్లు ధ్వంసమయ్యాయి. విద్యుత్ తీగలు తెగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మందమర్రి పట్టణంలో కేకే 5 ఫిల్టర్ బెడ్ చైతన్య కాలనీలో భారీ వృక్షం విరిగి ఇంటిపై పడడంతో ఇంటి ముందున్న రేకుల షెడ్డు ధ్వంసమైంది. కార్మెల్ పాఠశాల ఎదురుగా ఉన్న క్వార్టర్‌పై చెట్టు కొమ్మలు విరిగి పడడంతో ప్రహరీ కూలిపోయింది. ఆ సమయంలో ఇండ్లలో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. కేకే 5 గని సమీపంలో చెట్లు విరిగి పడి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సింగరేణి విద్యుత్ శాఖ సిబ్బంది హుటాహుటిన వచ్చిన మరమ్మతులు చేశారు. ఈదురు గాలులకు పలుచోట్ల ఫ్లెక్సీలు, భారీ హోర్డింగ్‌లు రోడ్లపై ఎగిరిపడడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

## ఇందిరమ్మ మోడల్ హౌస్

మద్దూరు(ధూళిమిట్ట), మే 5:అమృత్ తెలంగాణ: ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో భాగంగా తొలుత అన్ని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారుల అవగాహన కోసం ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణాలను చేపట్టింది. దీనిలో భాగంగా సిద్దిపేట జిల్లా మద్దూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మూడు నెలల క్రితం ప్రారంభించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పను లు నత్తనడకన కొనసాగుతున్నాయి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు నిర్మాణ పనులు నాసిరకంగా కొనసాగుతున్నాయి. నాణ్యతా ప్రమాణాలకు అధికారులు తిలోదకాలు ఇచ్చారు. కనీసం క్యూరింగ్ కూడా సరిగ్గా చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మోడల్ హౌస్ నిర్మాణ పనులు ముందుగా పూర్తయితే అదే రీతిన ఇండ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించే అవకాశం ఉంది. ప్రస్తుతం అలాంటి అవకాశం లేకుండా పోయింది.

# ఆదాయానికి మించి ఏం చేయలేను..

**సహకరించాల్సిన వారే సమరమంటే ఎలా?**
**పార్టీల కుట్రలో పావులుగా మారకండి**
**మనమంతా కలిస్తేనే ప్రభుత్వం**
**సమస్యలుంటే కూర్చుని చర్చించుకుందాం**
**ఉద్యోగ సంఘాలనుద్దేశించి సీఎం రేవంత్ వ్యాఖ్యలు**
**'తెలంగాణ పోలీస్ రియల్ హీరోస్-2025' అవార్డులందజేత**



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల తనను కోసినా ఆదాయానికి మించి ఏమీ చేయలేనని ఆయన వ్యాఖ్యానించారు. పదేండ్లపాటు రాష్ట్రాన్ని ఆర్థికంగా విధ్వంసం చేసిన వ్యక్తి ఇప్పుడు ఫామ్‌హౌస్‌లో హాయిగా పడుకున్నారని మాజీ సీఎం కేసీఆర్‌నుద్దేశించి విమర్శలు గుప్పించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో ప్రభుత్వానికి సహకరించాల్సిన ఉద్యోగ సంఘాలు.. ఇక సమరమే అంటూ హెచ్చరించటం సరికాదని అన్నారు. 'వారి సమరం ఎవరిపై? తెలంగాణ ప్రజలపైనా వారి యుద్ధం ?' అని సీఎం ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఓ మీడియా సంస్థ నిర్వహించిన 'తెలంగాణ పోలీస్ రియల్ హీరోస్–2025' అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగ సంఘాలనుద్దేశించి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకటో తారీఖున్నే జీతాలు ఇస్తున్నందుకు సమరానికి కాలు దువ్వుతున్నారా? అని ప్రశ్నించారు. జీతభత్యాల కోసం ప్రతీనెలా రూ.ఏడు వేల కోట్లు చెల్లిస్తున్నామని తెలిపారు. గత పాలకులు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద ఇవ్వాల్సిన రూ. 8,500 కోట్లను బకాయి పెట్టి వెళ్లారని వాపోయారు. ఆ విధంగా బకాయి పెట్టిన పార్టీలే, ఇప్పుడు తమ ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పిస్తున్నాయని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం పదహారు నెలల కాలంలో రూ. 30 వేల కోట్లను రైతుల ఖాతాలకు బదిలీ చేశామని సీఎం గుర్తు చేశారు. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్ అని చెప్పి ఆ శాఖకు చెల్లించాల్సిన బకాయిలను పెండింగ్‌లో పెట్టి పోయిందని తెలిపారు. విద్యుదుత్పత్తి కోసం బొగ్గును కొనుగోలు చేసి, సింగరేణికి డబ్బులివ్వకుండా ఎగ్గొట్టారని దుయ్యబట్టారు. ప్రాజెక్టులు కట్టామని చెబుతున్న వారు కాంట్రాక్టర్ల కు బిల్లులు చెల్లించకుండా మొండిచేయి చూపారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో 11 శాతం వడ్డీకి అప్పులు తెచ్చారు.. ఇంతకంటే దుర్మార్గం ఇంకోటి ఉంటుందా? అని ప్రశ్నించారు. ఇలాంటి వాస్తవాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలని ఉద్యోగ సంఘాలకు సీఎం సూచించారు. 'సమస్యలేమైనా ఉంటే పరిష్కరించుకుందాం, కూర్చుని మాట్లాడుకుందాం' అని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వమంటే తామొక్కరమే కాదనీ, అందరూ కలిస్తేనే ప్రభుత్వమని వ్యాఖ్యానించారు. 'మనం పాలకులం కాదు, సేవకులం మనం ఉన్నది సమరం చేయటానికి కాదు, ప్రజలకు సేవ చేయటానికి అని సూచించారు. ప్రజలపై యుద్ధం చేసిన వాళ్లెవరూ బాగుపడిన దాఖలాల్లేవని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ప్రభుత్వాన్ని అస్థిరపర చాలనే రాజకీయ పార్టీల కుట్రలో పావులు కావద్దంటూ ఉద్యోగ సంఘాలు, వాటి నేతలకు ఆయన హితవు పలికారు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యతగా వ్యవహరించాల్సిన ఉద్యోగులు, సంఘాల నేతలు బాధ్యత మరిచి వ్యవహరిస్తే తెలంగాణ సమాజం సహించబోదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం అనేది ఒక కుటుంబం లాంటిదనీ, అందువల్ల దాని పరువును బజారున పడేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి చర్యల ద్వారా తెలంగాణను మళ్లీ కోతుల గుంపునకు అప్పగిం చొద్దని కోరారు. ఇప్పుడు సమరం కాదు.. సమయస్ఫూర్తి అవసరమని నొక్కి చెప్పారు.

స్వీయ నియంత్రణే పరిష్కారం

%అప్పులు తెచ్చినా సరే.. సంక్షేమ పథకాలను అమలు చేద్దామంటే, కొత్త అప్పులు ఎక్కడా పుట్టటం లేదని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ప్రభుత్వానికి స్వీయ ఆర్థిక నియంత్రణ తప్ప వేరే మార్గం, పరిష్కారం లేదని అన్నారు.

పోలీసుల కుటుంబాలను ఆదుకుంటాం

%తెలంగాణ పోలీసులు నూటికి నూరు శాతం శాంతి భద్రతలను కాపాడుతున్నారని సీఎం ప్రశంసించారు. దేశ సరిహద్దుల్లో సైనికుల మాదిరిగా వారు రాష్ట్రాన్ని కాపాడుతున్నారని కొనియాడారు. ఇక్కడ శాంతి భద్రతలు బాగుండటం వల్లే ప్రపంచస్థాయిలో పెట్టుబడులను మనం ఆకర్షించగలుగుతున్నామని వివరించారు. పోలీస్ ఉద్యోగం కత్తిమీద సాములాంటిదని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటోందని తెలిపారు. విధి నిర్వహణలో మరణించిన ఐపీఎస్‌ల కుటుంబాలకు రూ. 2 కోట్లు, ఎస్పీ, అడిషనల్ ఎస్పీల కుటుంబాలకు రూ.కోటిన్నర పరిహారంగా అందిస్తున్నామని వెల్లడించారు. పోలీసుల పిల్లల భవిష్యత్ కోసం 50 ఎకరాల్లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించామని సీఎం గుర్తు చేశారు. వారికి మంచి భవిష్యత్‌ను అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని భరోసానిచ్చారు. ఈ సందర్భం గా పలువురు పోలీస్, ట్రాఫిక్ అధికారులకు ముఖ్యమంత్రి అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 15న పోచంపల్లికి రానున్న మిస్ వరల్డ్ 2025 పోటీదారులు..



కామారెడ్డి: అమృత్ తెలంగాణ:ఒక ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలో భాగస్వాములు అవుతున్న మిస్ వరల్డ్ - 2025 గ్రూప్ - 2 పోటీదారులు మే 15న ప్రపంచ ప్రఖ్యాత చేనేత గ్రామం పోచంపల్లిని సందర్శించనున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ వస్త్ర సంప్రదాయాలలో ఒకటైన పోచంపల్లి ఇకపై ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న పోచంపల్లి, దాని సంక్లిష్టమైన ఇక్కత్ నేత పద్ధతులకు అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకుంది. పోచంపల్లిని యునెస్కో "ప్రపంచంలోని ఉత్తమ పర్యాటక గ్రామం"గా గుర్తించింది. ఇది చేతిపనులు, సంస్కృతి , వారసత్వానికి సజీవ మ్యూజియం. మిస్ వరల్డ్ పోటీదారులు ఇక్కత్ సాంప్రదాయ టై / అండ- డై ప్రక్రియను అనుభవిస్తారు. నిష్ణాతులైన నేత కార్మికులతో సంభాషిస్తారు. హైదరాబాద్ నిజాంలు ఒకప్పుడు అభిమానించిన డబుల్ ఇకాట్ కళాఖండం అయిన ఐకానిక్ టెలియా రుమల్ తయారీని చూస్తారు. ఆచార్య వినోబా భావే నేతృత్వంలోని భూదాన్ ఉద్యమంలో చారిత్రాత్మక పాత్ర పోషించిన ఈ గ్రామం వస్త్ర కళాత్మకత, సామాజిక–సాంస్కృతిక వారసత్వం యొక్క అరుదైన మిశ్రమాన్ని అందిస్తుంది. మిస్ వరల్డ్ వేదిక అపూర్వమైన అంతర్జాతీయ దృశ్యమానతను అందిస్తున్నందున, ఈ ప్రతిష్టాత్మక సందర్శన తెలంగాణ యొక్క గొప్ప చేనేత వారసత్వాన్ని ప్రపంచ పటంలో ఉంచుతుంది. పోచంపల్లి యొక్క శక్తివంతమైన నేత, గ్రామీణ హస్తకళ, సాంస్కృతిక లోతును ప్రదర్శించడం ద్వారా, ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా ఉన్న చేనేత అభిమానులకు భారతదేశ జీవన సంప్రదాయాల యొక్క శక్తివంతమైన వేడుకగా మారుతుంది. ఈ నెల చివర్లో హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే కోసం అంచనాలు పెరుగుతున్న కొద్దీ, పోచంపల్లి సందర్శన ఒక హైలైట్‌గా ఉంటుంది. చేనేత వారసత్వాన్ని , మగ్గం తెలంగాణ కథను ప్రపంచానికి తెలియజేస్తుందనీ హైదరాబాద్ నుంచి ఐఎన్పిఆర్ స్పెషల్ కమిషనర్ ఈ ప్రకటనను జారీ చేశారు.

# రేవంత్ రెడ్డి మంచి మిత్రుడు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: సీఎం రేవంత్‌రెడ్డి తనకు మంచి మిత్రుడనీ, ఆయనతో తనకు విభేదాల్లేవని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. సీఎం కాబట్టే ఆయన్ను రాష్ట్రంలోని సమస్యలపై ప్రశ్నిస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు తప్ప ఎక్కడా పాలకమండళ్లు లేవనీ, పాలన అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. తెలంగాణ రోల్ మోడల్ అని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి..గ్రామ పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నారని విమర్శించారు. జీహెచ్ఎంసీలో కూడా డబ్బుల్లేవనీ, కాగితాలిచ్చి లోన్లు తెచ్చుకోవాలని గుత్తేదారులకు ప్రభుత్వం చెప్పడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. గుత్తేదారులు కూడా సచివాలయంలో ధర్నాలు చేస్తున్నారంటే కొంచెం కూడా సిగ్గు అనిపించడం లేదా? అని అడిగారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి బెనిఫిట్స్ ఇవ్వడం లేదని విమర్శించారు. చివరకు వారి దగ్గర కూడా కమీషన్లు తీసుకుంటున్న పరిస్థితి ఉందని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో రేవంత్ రెడ్డికి రాష్ట్రాన్ని పాలించే నైతిక హక్కు ఉందా? అని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లను కాంగ్రెస్ పార్టీవాళ్లకే ఇస్తున్నారని ఆరోపించారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకపోతే ఊరుకోబోమని హెచ్చరించారు. హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు నిధులివ్వాలని కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని కోరుతామని చెప్పారు. రేవంత్ రెడ్డి రూపంలో కాంగ్రెస్ బొంద పెట్టబడిందని ఆ పార్టీ నేతలే చెబుతున్నారన్నారు. అందాల పోటీలకు తాము వ్యతిరేకంగా కాదుగానీ ముందుకు రాష్ట్రంలోని రైతులు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉప్పల్ ఫ్లైఓవర్ గుత్తేదారు కాంగ్రెస్ కు చెందిన సుబ్బిరామిరెడ్డి అనీ, ఆయన దివాళా తీసి ఫ్లైఓవర్ పూర్తిచేయలేక పారిపోయారని విమర్శించారు.

# నీళ్లను ఆపితే అణ్వాయుధ దాడి చేస్తాం: వార్నింగ్ ఇచ్చిన పాకిస్థాన్



మాస్కో:అమృత్ తెలంగాణ: తమకు రావాల్సిన నీటిని అడ్డుకున్నా.. లేక దారి మళ్లించినా.. దాన్ని పూర్తి స్థాయిలో తిప్పికొడుతామని, అవసరమైతే అణ్వాయుధ దాడి కి కూడా పాల్పడుతామని పాకిస్థాన్ వార్నింగ్ ఇచ్చింది. రష్యాలోని పాకిస్థాన్ అంబాసిడర్ మొహమ్మద్ ఖలీద్ జమాలీ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా మీడియా టీఏఎస్ఎస్ న్యూస్ ఏజెన్సీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ఇండో, పాక్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తలు నెలకొన్న విషయం తెలిసిందే. పాక్ చర్యలను ఖండిస్తూ సింధూ జలాలను ఆపేందుకు భారత సర్కారు సిద్ధమైంది. సింధూ జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేస్తూ.. తాజాగా చీనాబ్ నది నీటిని రిలీజ్ చేయడం లేదు. ఒకవేళ నీళ్లను అడ్డుకున్నా లేక దారి మళ్లించినా పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని ఆ అంబాసిడర్ పేర్కొన్నారు. నీళ్లను అడ్డుకోవడాన్ని, డైవర్ట్ చేయడాన్ని యుద్ధ చర్యగా భావిస్తామని, దీన్ని పూర్తి స్థాయిలో తిప్పికొడుతామన్నారు. ఏప్రిల్ 22వ తేదీన పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకు మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే రెండు దేశాల సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. రెండూ అణ్వాయుధ దేశాలే అని, ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని ఆయన

# అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ అన్నదాతల అవస్థలపై లేదు.. సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ధ్వజం



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: సీఎం రేవంత్ రెడ్డికి అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ అన్నదాతల అవస్థల మీద లేదని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం అన్నదాతలకు కన్నీళ్లు పెట్టిస్తున్నదని అన్నారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే సకాలంలో కొనుగోళ్లు చేపట్టకపోవడం నిరాశలోకి నెడుతున్నారని మండిపడ్డారు. సిద్దిపేట మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని సోమవారం నాడు హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను పరామర్శించిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.

సరైన కరెంటు ఇవ్వక నీళ్లు ఇవ్వక పంటలు ఎండ కొట్టిందని.. రైతులను అన్ని రకాలుగా తిప్పలు పెడుతుందని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వం రైతులకు రైతుబంధు ఇవ్వలేదు.. నాణ్యమైన కరెంటు ఇవ్వలేదు.. నీళ్లు ఇవ్వలేదు.. పండిన పంటను కూడా కొనడం లేదు అని విమర్శించారు. రుణమాఫీ జరిగిన రైతులు వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం రుణమాఫీ కాని వారి వివరాలతో కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. 25 శాతం మందికి రుణమాఫీ చేసి పూర్తి రుణమాఫీ జరిగిందని ప్రచారం చేసుకోవడం దుర్మార్గమని అన్నారు.

మరికొన్ని చోట్ల దొంగల బెడద కూడా రైతన్నకు నిద్ర లేకుండా చేస్తున్నదని హరీశ్‌రావు అన్నారు. ఇంటిని వదిలి, రోజుల తరబడి రైతులు వరి కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పి అక్కడే కాపలా కాస్తున్న పరిస్థితి ఉందని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం అన్నదాతలకు కన్నీళ్లు పెట్టిస్తున్నదని అన్నారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే సకాలంలో కొనుగోళ్లు చేపట్టకపోవడం నిరాశలోకి నెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ అన్నదాతల అవస్థ మీద రేవంత్ రెడ్డికి లేదని మండిపడ్డారు. జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా మామిడి రైతులు నష్టపోయారని తెలిపారు. పత్తి రైతులకు ప్రభుత్వం మోసం చేసింని అన్నారు. అధికారులతో కలిసి పత్తి రైతులను ముంచి 3500 కోట్ల కుంభకోణం చేశారని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ ప్రశ్నించిన తర్వాత విజిలెన్స్ ఎంక్వయిరీ వేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం సహా, రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నా పాలకుల్లో మాత్రం ఎలాంటి చలనం లేదని మండిపడ్డారు.

# పదోన్నతులు ఇచ్చినందుకు థ్యాంక్స్



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: విద్యుత్‌శాఖలో 2012 బ్యాచ్‌కి చెందిన అసిస్టెంట్ ఇంజనీర్లకు అసిస్టెంట్ డివిజనల్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించి పోస్టింగ్స్ ఇచ్చినందుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ (టీజీపీఈఏ) కృతజ్ఞతలు తెలిపింది. సోమవారం నాడిక్కడి ప్రజాభవన్‌లో టీజీపీఈఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీ రత్నాకరరావు, పీ సదానందం డిప్యూటీ సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు చెప్పారు. 4వేల మెగావాట్ల వ్యవస్థాపిత సామర్థ్యం కలిగిన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను జాతికి అంకితం చేయడానికి అనుగుణంగా ఇంజనీర్లకు పోస్టింగ్ ఇచ్చారని వివరించారు. గడచిన 15 ఏండ్లలో 209 మందికి పదోన్నతులు కల్పించడం ఇది మొదటిసారి చెప్పారు. ప్రభుత్వ ముందస్తు ప్రణాళికతో రబీ సీజన్‌లో అత్యధికంగా 17,162 మెగావాట్ల విద్యుత్‌ను మార్చి నెలలో సరఫరా చేయగలిగామన్నారు. విద్యుత్ ఇంజనీర్లు తమ విధుల పట్ల ఎల్లప్పుడు పునరంకితం అయ్యే ఉంటారని తెలిపారు.

# పోలీసులకు గుడ్ న్యూస్ చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: సరిహద్దుల్లో సైనికుల్లా రాష్ట్రంలో పోలీసులు శాంతిభద్రతలు కాపాడుతున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన పోలీసుల కుటుంబాలకు భరోసా ఇస్తున్నామని చెప్పారు. విధి నిర్వహణలో మరణించిన ఐపీఎస్‌ల కుటుంబాలకు రూ. 2కోట్లు అందిస్తున్నట్లు తెలిపారు. పోలీసుల పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

# జాతీయ రహదారుల విస్తీర్ణం పొడిగించండి..

## బైంసా నుండి బాసరకు ఫోర్ లైన్ రోడ్డు వేయండి

## జాతీయ రహదారిపై ప్రతి గ్రామం వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి...

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి విన్నవించిన ఎమ్మెల్యే పవర్ రామరావుపటేల్



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి కి స్వాగతం పలుకుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎమ్మెల్యే రామారావు పటేల్



కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి

అమృత్ తెలంగాణ ముధోల్ నియోజకవర్గంలోని 161 జాతీయ రహదారిపై బైంసా నుండి బాసర, త్రిబుల్ ఐటీ వరకు ఫోర్ లైన్ రోడ్డు వేయడంతో పాటు, సెంట్రల్ లైటింగ్ విత్ డివైడర్, అదేవిధంగా బైంసా నుండి బాసర వరకు ఫోర్ లైన్ రోడ్ వేయడంతో పాటు సెంట్రల్ లైటింగ్ విత్ డివైడర్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ విన్నవించారు సోమవారం ఆసిఫాబాద్ కాగజ్ నగర్ లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రిని కలిశారు. బైంసా నుండి బాసర త్రిబుల్ ఐటీ వరకు ఫోర్ లైన్ రోడ్డు వేస్తే సౌకర్యంగా ఉంటుందన్నారు. అదేవిధంగా దేగాం నుండి బైంసా వరకు ఫోర్ లైన్ వేస్తే ఇండస్ట్రియల్ ఏరియా, షో రూమ్ లు, కళ్యాణ మండపాలు ఉండడంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అదేవిధంగా బేల్ తరోడ గ్రామం నుండి నిర్మల్ వరకు జాతీయ రహదారిని ప్రతి గ్రామం వద్ద రెండు వైపులా ఒక మీటర్ మేర విస్తీర్ణం పొడిగించి, డివైడర్ ను నిర్మించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఒక్క సంవత్సరంలోనే ఈ రహదారిపై ప్రమాదాలు జరిగి, 27 మంది చనిపోయారని, 67 మంది గాయపడ్డారని ఆయన వినతి పత్రంలో పేర్కొన్నారు. దీంతోపాటు బాసర నుండి మహోర్ కు జాతీయ రహదారిని అనుసంధానం చేసి ఆధ్యాత్మిక మార్గం చేయాలని కోరారు

# దేశవ్యాప్త సార్వతీక సమ్మెను జయప్రదం చేయండి

## గ్రామపంచాయతీ కార్మికుల మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ : సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న డీపీఓ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ గౌడ్ సమ్మె నోటీ అందజేత చేయడం మే 20న జరిగే దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ / వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న పిలుపునిచ్చారు. మే 20న జరిగే దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నామని డీపీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ గౌడ్ సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం బరితెగించి కార్పొరేట్ మతోన్మాదులకు అనుకూలంగా పేద ప్రజలకు, కార్మికులకు వ్యతిరేక విధానాలను దూకుడుగా అమలు చేస్తుందని అన్నారు. అనేక త్యాగాలు, రక్త తర్పణలతో దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కార్మికుల చట్టాలను రద్దు చేసి, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్ అమలు చేయాలని మోడీ ప్రభుత్వం తహతహలాడుతుందని అన్నారు. మరోపక్క దేశ ప్రజలు కూడబెట్టుకున్న జాతి సంపదను సహజ వనరులను, ప్రభుత్వరంగ సంస్థల వాటాలను నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ పేరుతో బడా బాబులకు, కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందని విమర్శించారు. కార్మికులందరికీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేల రూపాయలు ఇవ్వాలని, కార్మికులకు ఉరితాలుగా మారే నాలుగు లేబర్ కోట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కులు, ఉద్యోగ భద్రతలు కల్పించాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు అశోక్,వెంకట్రావు, సోనేరావు,గంగన్న,కిరణ్,సంతోష్ రాజేందర్,శంకర్, నరేష్,వర్ణ,కత్తి మల్లమ్మ,మీరాబాయి తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## మాల సంఘం ఆధ్వర్యంలో నూతన ఎస్సైని కలిసిన మాల సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్




మాల సంఘం ఆధ్వర్యంలో సన్మానిస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ జైనథ్ న్యూస్ జైనథ్ మండల్ నూతన SI గా బాధ్యతలు చేపట్టిన గౌతమ్ మర్యాద పూర్వకంగా కలిసి షాల్వతో సత్కరించిన బొబ్బిలి సుధాకర్, పాశం రాఘవేంద్ర, మేదరి స్వామి,చిల్క చిన్నన్న ఉన్నారు, మండల ప్రజల శాంతి భద్రత విషయం లో చక్కటి పేరు సంపాదించాలి అని కోరడమైనది.

## పాఠశాలలకు వంట పాత్రల పంపిణీ..

కమ్మర్ పల్లి: అమృత్ తెలంగాణ:మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా అందజేసిన వంట పాత్రలను సోమవారం పంపిణీ చేసినట్లు మండల విద్యాధికారి ఆంధ్రయ్య తెలిపారు. మండలంలోని 22 ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలకు భోజనం తయారు చేయుటకు, వడ్డించుటకు అవసరం అయినా వంట పాత్రలు అందజేసినట్లు వివరించారు.

## కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో కేంద్రం ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పర్యటనలో ఆదిలాబాద్ ఎంపీ గెడం నాగేష్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో కేంద్రం ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పర్యటనలో ఆదిలాబాద్ ఎంపీ గెడం నాగేష్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గడ్కరీని ని శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రహదారుల సమస్యలను పరిష్కరించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డితో జిల్లా అభివృద్ధిపై చర్చించారు..

# పంచాయితీ కార్మికుని కుటుంబానికి సీఐటీయూ చేయూత

## ఆర్థిక సహాయం అందించిన కార్మికులు ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్


అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : వారం రోజుల క్రితం విధులు నిర్వహిస్తూ ప్రమాదవశ్యత్తు కరెంట్ స్థంభం పై నుండి పడి మృతి చెందిన ఈ దుల్ల సవర్ గాం గ్రామానికి చెందిన గజకంటి ప్రభాకర్ అనే దళిత కార్మికుని కుటుంబానికి కార్మికుల నుండీ సేకరించిన రూ "12000 లను సిపిఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ ,సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న ,ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి ,లింగాల చిన్నన్న ,జిల్లా కమిటీ సభ్యులు ఆర్ .సురేందర్ లు గ్రామపంచాయితీ కార్మికులతో కలిసి కుటుంబానికి అందించారు . సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ విధినిర్వహణలో మృతిచెందిన పేద దళిత కార్మికున్ని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఉన్నతాధికారులు ఆదుకోక పోగ ఆదుకోవాలని అడిగినందుకు సీఐటీయూ ,సిపిఎం నాయకులపై హత్యాయత్నం కేసులు బనాయించారని మండిపడ్డారు . కాంగ్రెస్ పార్టీని గెలిపించిన వారిలో కార్మికులు ముందుభాగాన ఉన్నారు ,అందులో గ్రామపంచాయితీ కార్మికులు ముఖ్యభూమిక పోషించారని గుర్తు చేశారు . కార్మికులకు న్యాయం చేయాల్సింది పోయి అన్యాయం చేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని విమర్శించారు . దళితుల పట్ల నిర్లక్షంగా వ్యవహరిస్తున్నది వారి ప్రాణాలకు విలువలేదు అన్నట్లు ప్రవర్తిస్తున్నదన్నారు . గెలిపించిన వారికీ ఓడించడం పెద్ద పనేం కాదని అన్నారు .ఆ దుస్థితి పట్టకుండా చూసుకోవాలని , పోలిసుల ద్వారా ఉద్యమాలను అణచాలని చూడవద్దని హితవు పలికారు . వెంటనే ప్రభాకర్ కుటుంబానికి యాభై లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించి ,కుటుంబంలో ఒకరి వుద్యోగం కల్పించి ,మూడు ఎకరాల సాగుభూమిని ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో గ్రామపంచాయితీ యూనియన్ నాయకులు అశోక్ ,గంగన్న ,సోనేరావు ,వెంకట్రావు ,ఇంద్రజ్ ,కిరణ్,శంకర్, సంతోష్,రాజేందర్ తదితరులు పాల్గొన్నారు .



ఆర్థిక సాయం అందజేస్తున్న సిఐటియు నాయకులు

## జూన్ 14 న అన్ని న్యాయ స్థానాలలో జరగబోవు జాతీయ లోక్ అదాలత్ గురించి జిల్లా పోలీస్ అధికారులతో ఆన్లైన్ లో సమీక్ష సమావేశం : జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల ఐ.పి.యస్.



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : జూన్ 14 న జరుగబోవు జాతీయ లోక్ అదాలత్ దృష్టిలో ఉంచుకుని సోమవారం జిల్లా ముఖ్య కార్యాలయం లో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ జిల్లాలోని పోలీస్ అధికారులతో మరియు కోర్టు పోలీస్ అధికారులతో ఆన్లైన్ లో దిశా నిర్దేశాలు చేసారు. వివాదాలు మరియు రాజీ పడే క్రిమినల్ కేసులు, పెండింగ్లో ఉన్న టూ వీలర్ / ఫోర్ వీలర్ చలాన్ కేసులు మరియు పెట్టీ కేసులు మొదలైన వాటికి సంభందించిన కేసులను సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కక్షి దారులందరికి సమాచారం అందించి ఈ సదవకాశాన్ని వినియోగించుకావాలని తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో కేసు పరిష్కారం ద్వారా వారి యొక్క సమయం మరియు డబ్బును ఆదా చేసుకోగలరనీ తెలపాలన్నారు. ఈ లోక్ అదాలత్ లో పరిష్కారానికి అవకాశం ఉన్న కేసుల వివరాలు తయారు చేసుకుని తగిన వారందరికీ సమాచారం అందేలా చూడాలని తెలియజేసారు. ఈ అమూల్యమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేల వారికి కేసుల గురించి వివరించాలని తెలిపారు

# పుడ్ బ్యాంక్ భైంసా ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానం





అన్నదానం చేస్తున్న ఆంజనేయులు

అమృత్ తెలంగాణ భైంసా న్యూస్ : లోకేశ్వరం మండల కేంద్రానికి చెందిన శ్రీమతి/శ్రీ లక్కంపెల్లి సుప్రియ శ్రీనివాస్ రావ్ 24 వ పెళ్లి రోజు సందర్భంగా వృదా కర్చు చేయకుండా ఫుడ్ బ్యాంక్ భైంసా ఆధ్వర్యంలో నిరుపేదలకు అభాగ్యులకు అన్నదానం చేయమని మా అమ్మ నాన్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు యం ఆంజనేయులు కు ఆర్థిక సహాయం చేయడంతో.. ఆర్థిక సహాయంతో దేగాం చుట్టు ప్రక్కల ఇటుక బట్టిలలోని కార్మికులకు భైంసా చుట్టు ప్రక్కల అక్కడ అక్కడగల నిరుపేదలకు అభాగ్యులకు దాదాపు 70 మందికి అన్నదానం చేయడం జరిగింది.

# ప్రజా సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలి అని

## సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహణ : జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్

## సమస్య విన్న వెంటనే ప్రత్యేక శ్రద్ధ తో వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశం.

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : ప్రతి సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నందు ప్రజా ఫిర్యాదుల రోజును నిర్వహించడం జరుగుతుందని ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ ముఖ్య కార్యాలయం నందు 1 ఫిర్యాదుదారులు సమస్యలను జిల్లా ఎస్పీకి వివరించారు, నిన్న వెంటనే జిల్లా ఎస్పీ సమాధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలను జారీ చేశారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.

ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించినప్పుడే పోలీసుల పట్ల ఉన్న గౌరవం పతక స్థాయికి చేరుకుంటుందని, ప్రజలలో పోలీసుల పై నమ్మకం, కీర్తి ప్రతిష్టలు పెంపొందించబడతాయని తెలిపారు. సుదూర ప్రాంతాల ఫిర్యాదుదారులు జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకోలేని వారు మెసేజ్ యువర్ ఎస్పి కార్యక్రమంలో ద్వారా 8712659599 నంబర్కు వాట్సప్ ద్వారా సంప్రదించాలని తెలిపారు.





# హైకోర్టు న్యాయమూర్తికి బార్ నివాళి

కంఠేశ్వర్ :అమృత్ తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గిరిజా ప్రియదర్శిని మృతికి నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఘనంగా నివాళులర్పించింది. జస్టిస్ ప్రియదర్శిని అనారోగ్యంతో హైదరాబాద్ లో మృతి చెందిన విషయం విదితమే. జిల్లాకోర్టు ప్రాంగణంలోని బార్ సమావేశపు హల్ లో బార్ ఉపాధ్యక్షుడు దిలీప్ అధ్యక్షత జరిగిన సంతాప సమావేశంలో జస్టిస్ ప్రియదర్శిని జీవనాన్ని వివరించారు. మహిళల సాధికారతలో ఉన్నత స్థానానికి చేరుకున్న ఆమె ఎంతో జీవితం ఉన్న మృత్యువు పాలుకావడం దురదృష్టకరమని ఆయన అన్నారు. అనంతరం బార్ ప్రధాన



కార్యదర్శి మానిక్ రాజు కామారెడ్డి బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది మోహన్ రావు కులకర్ణి అకాల మృతి విషాదకరమని అన్నారు. కామారెడ్డి, నిజామాబాద్ కోర్టులలో న్యాయవాద వృత్తిలో ఉంటు అందరి మన్ననలు పొందారని తెలిపారు. సమావేశంలో బార్ కోశాధికారి నారాయణ దాసు, న్యాయవాదులుసంగమేశ్వర్ రావు, కిరణ్ కుమార్ గౌడ్,చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్ కుమార్ సుబేదార్ న్యాయమూర్తి, న్యాయవాది ల వృత్తి జీవనగమనాన్ని యువ న్యాయవాదులు స్ఫూర్తిగా తీసుకుని ఎదగాలని అన్నారు. అనంతరం న్యాయవాదులు ఇద్దరి మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

# రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలి – జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.

**బోథ్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.**

**పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డులు, సిబ్బంది పనితీరు పై తనిఖీ.**

**పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకట్ట వేయాలని ఆదేశం.**





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : సోమవారం సాయంత్రం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ బోథ్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మొదటగా పోలీస్ స్టేషన్ పరిసరాలను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలపై వాటి ప్రస్తుత స్థితిగతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా గట్టిగా గస్తీ నిర్వహిస్తూ ఆరికట్టాలను సూచించారు. పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రికార్డుల నిర్వహణ తప్పకుండా నవీకరిస్తూ ఉండాలని, ఎటువంటి పెండెన్సీ లేకుండా రికార్డుల నిర్వహణ చేయాలనే సూచించారు. పోలీస్ స్టేషన్లో రిసెప్షన్ సెంటర్ ను పరిశీలించి బాధితుల పట్ల వ్యవహరించే తీరును, ఫిర్యాదులను పరిష్కరించే తీరును పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులను నిర్వర్తించాలని సూచించారు. ప్రజలతో మమేకమై సత్సంబంధాలను మెరుగుపరుచుకుంటూ,

ఎలాంటి రిమార్కులు లేకుండా, ప్రజలలో పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే విధంగా విధులను నిర్వర్తించాలని సూచించారు. డయల్ 100, బ్లూ కోర్ట్ సిబ్బంది గ్రామ గ్రామాన సందర్శిస్తూ సమాచార సేకరణలో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోత్ సిఐ వెంకటేశ్వర రావు, ఎస్సై ప్రవీణ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి చట్టంతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నూతన భూభారతి చట్టం (ఆర్వోఆర్ చట్టం–2025) ద్వారా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతు వేదికలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని రూపొందించిందని, ఈ చట్టం అమలుతో ధరణి చట్టానికి ముందున్న సాధాబైనమా ప్రక్రియ తిరిగి వినియోగంలోకి రానుందని తెలిపారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండానే తహసిల్దార్ స్థాయిలోనే సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు. నూతన చట్టం ప్రకారం భూ సమస్యలపై ప్రజలు దరఖాస్తు చేస్తే, సంబంధిత అధికారులు నిర్ణిత గడువులోగా విచారించి, పరిష్కార చర్యలు చేపడతారని పేర్కొన్నారు. నేటి నుండి కుంటాల మండలంలో గ్రామ రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయని, ప్రజల నుంచి భూసంబంధిత దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. అనంతరం సదస్సులో పాల్గొన్న ప్రజలు, రైతుల సమస్యలను కలెక్టర్ స్వయంగా విని, పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ అవగాహనా సదస్సులో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి సందీప్ కుమార్, తహసిల్దార్ రాజు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి భూసమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టాన్ని అమలు చేస్తూ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. కుంటాల మండలంలోని ఓల గ్రామంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి చర్చించి వారి సమస్యలపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించడం, వారి సందేహాల నివృత్తి చేయడమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూమిపై పూర్తి హక్కులను కల్పించేందుకు ప్రభుత్వం చట్టాన్ని అమలు చేస్తోందన్నారు. కుంటాల మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సదస్సుల్లో భూ రికార్డులలో పేరు, విస్తీర్ణం లోపాలు, వారసత్వ భూములు, భూ స్వభావం, నిషేధిత జాబితాలోని భూములు, సర్వే నంబర్ల లోపాలు, పట్టా పాస్ బుక్కుల లేని భూములు, సాదాబైనామాలు, హద్దుల సమస్యలు, పార్ట్–బి భూములు, భూసేకరణ కేసులపై దరఖాస్తులు స్వీకరించి, భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్ ప్రకారం విచారణ జరిపి పరిష్కరిస్తామని వివరించారు. వివిధ కారణాల వలన రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు సమర్పించలేని వారు తర్వాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ధరణి పోర్టల్ ద్వారా ఆన్లైన్లో అప్లై చేసుకునే సదుపాయం ఉందని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రింట్ చేసిన ప్రొఫార్మాల ఆధారంగా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, క్షేత్రస్థాయి విచారణకు వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని సూచించారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ల ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి, సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు. ప్రజలు సమర్పించిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాలని అధికారులకు ఆదేశించారు. ఈ సదస్సులో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, తహసీల్దార్ కమల్ సింగ్, తహసీల్దార్ ప్రత్యేక అధికారులు ఏజాజ్ అహ్మద్, ప్రవీణ్ కుమార్,రెవెన్యూ సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# త్వరిత పరిష్కారమే లక్ష్యంగా ప్రజావాణి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.





హాజరైన అధికారులు

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లావ్యాప్తంగా వచ్చిన ప్రజల విజ్ఞప్తులు ఆమె స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూసమస్యలు, ఇందిరమ్మ ఇండ్ల అంశాలపై ప్రజలు అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని, శాఖలవారీగా పెండింగ్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితా సిద్ధం చేయాలని, రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన తక్షణమే పూర్తిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాల్లో అవసరమైన మరమ్మత్తులు చేపట్టి సమయానికి పూర్తిచేయాలని ఆదేశించారు. అధికారులంతా సమయపాలన పాటించాలని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు వేసవి దృష్ట్యా ఏర్పాటు చేసిన టెలిఫోన్ ప్రజావాణిలో 91005 77132 నంబరుకు కాల్ చేసి ప్రజలు తమ సమస్యలు తెలియజేయాలని, వాట్సప్ ద్వారా దరఖాస్తులు పంపవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఐదుగురు పేకాట ఆడుతుండగా అరెస్ట్ - అదిలాబాద్ రెండవ పట్టణ సీఐ సిహెచ్ కరుణాకర్ రావు

**రూ 8,800/- నగదు, పేకాట ముక్కలు, నాలుగు మొబైల్ ఫోన్లో, 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం.**

**ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు, విచారణ.**





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఆసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపలనే జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ఆదేశాల మేరకు, ఈరోజు ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో లారీ అసోసియేషన్ ఏరియా వద్ద పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేయగా సంఘటన స్థలంలో పేకాట ఆడుతూ ఐదుగురు నిందితులు పట్టబడ్డారని తెలిపారు. వారి వద్ద నుండి రూ 8,800/– నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు, స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. వారి పేర్లు సిరాజ్ ఖాన్, షేక్ హసేన్, సందీప్, షబ్బీర్ ఖాన్, షేక్ మునీర్ వీరందరూ లారీ ఓనర్లు డ్రైవర్లు గా ఉన్నారని తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు ఆదిలాబాద్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించడానికి లేదని, నిర్వహించిన వారిని ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఎన్నో మార్పులు:

**తొలిసారిగా పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల తో గూగుల్ మీట్ ద్వారా సమావేశం**

**రాష్ట్రం లోనే పదవ తరగతి ఫలితాలలో జిల్లా 15 వ స్థానం నుండి 9 వ స్థానం లో అగ్రగామిగా నిలిచింది:**





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : జిల్లా పాలనాధికారి సహాయ సహకారాలతో విద్యార్థుల పై చూపించిన ప్రత్యేక శ్రద్ధ , ప్రోత్సాహం తో, గూగుల్ మీట్ ద్వారా దిశా నిర్దేశం తోనే జిల్లా టాప్ గా నిలిచింది. అందరి సహకారంతో జిల్లా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 97. 18 శాతం ఉత్తీర్ణత తో రాష్ట్ర స్థాయిలో 9 వ స్థానం నిలిచిందనికలెక్టర్ ను అభినందిస్తూ,హర్షం వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ అభినందన అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను సన్మానించి, అభినందించిన కలెక్టర్ టాపర్ గా నిలిచిన విద్యార్థులు మాట్లాడుతూ కలెక్టర్ గారికి ధన్యవాదాలు తెలుపుతూ వారి వారి గోల్స్ ను వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్, dieo గణేష్, వెల్ఫేర్ హాస్టల్ ప్రిన్సిపల్స్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# తూకం వేసిన ధాన్యాన్ని గోదాంలకు తరలించాలి..




జన్నారం: అమృత్ తెలంగాణ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఐకెపి పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంట వెంటనే గోదాములకు తరలించాలని, మండల సామాజిక ఉద్యమకారుడు శ్రీరాముల, భూమా చారి అన్నారు. సోమవారం ప్రధాన రహదారి మండల తాసిల్ చౌరస్తా నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు రైతులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాసిల్దార్ రాజ మనోహర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యం 5 కిలోలు అదనంగా తూకం వేస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అయినా సరే ఆ నష్టాన్ని రైతులు ఓర్చుకున్నప్పటికీ, తూకంలో జాప్యం చేస్తూ, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంట వెంటనే లారీల ద్వారా గోదాములకు తరలిస్తే, అకాల వర్షాలకు రైతులు, ధాన్యం తడవకుండా రైతులకు నష్టం వాటిల్లకుండా ఉంటుందన్నారు. ఆలస్యం చేయడం వల్ల అకాల వర్షాలకు రైతుల ధాన్యం తడిచిపోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు స్పందించి వెంట వెంటనే తూకం వేస్తూ వెంటవెంటనే తూకం వేసిన ధాన్యాన్ని గోదాములకు తరలించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నామన్నారు. లేకుంటే రైతుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# సైన్స్ కాలేజ్ లో దోస్త్ హెల్ప్ లైన్ ఏర్పాటు..



ఆదిలాబాద్ :అమృత్ తెలంగాణ: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం దోస్త్ నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలోని విద్యార్థుల సౌకర్యార్థం కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ లో దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ ను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జె సంగీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 3వ తేదీ నుంచి ఆన్లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంని అన్నారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో ఏమైనా సమస్యలు వస్తే.. దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ ను సంప్రదించాలని సూచించారు. మూడు దశల ఆన్లైన్ దరఖాస్తుల కోసం హెల్ప్ లైన్ సెంటర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు దోస్తు కోఆర్డినేటర్ రవి కిరణ్, టెక్నికల్ అసిస్టెంట్ లు ఇమ్రాన్ అలీ, దుర్గా శేఖర్ లను 7702157284, 9703533626 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# సీపీని కలిసిన ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి




ఆర్మూర్: అమృత్ తెలంగాణ: స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, ఆలూరు మండలం మాజీ అధ్యక్షులు కొత్తూరు గంగాధర్ లు సోమవారం నూతన సీపీ సాయి చైతన్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో గంజాయిని అరికట్టాలని, శాంతి భద్రతలను కాపాడాలని కోరారు.

